
సాక్షి పల్నాడు

శనివారం । 29 । మార్చి । 2025



రేపు బాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు శుక్రవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 521.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నగరోత్సవానికి వెండి రథం సిద్ధం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది నాడు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించే వెండి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వెండి రథానికి సిబ్బంది శుక్రవారం మెరుగులు దిద్దారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
నరసరావుపేట	6.27	4.50
గుంటూరు	6.25	4.48
బాపట్ల	6.25	4.48

న్యూస్‌రీల్

ఈద్గా మైదానంలో ఇఫ్తార్ విందు



నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ప్రకాష్‌నగర్ ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. విందును వడ్డించి, తామూ స్వీకరించారు. టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు నేటి నుంచి వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం రంజాన్ పండగను పురస్కరించుకుని మిర్చి యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్టు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి రైతుల సురుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

శ్రీరామ పట్టాభిషేక అలంకారం



మంగళగిరి టౌన్ : మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి భక్తులకు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కారుమంచి మురళీసాయి, సోదరులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరిపట్టణానికి చెందిన యేనుగ కిషోర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, కళ్లజోళ్లు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈ వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బందికి టోపీలు, కళ్ళజోళ్లు ఉపయోగపడతాయని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి టోపీలు, కళ్ళ జోళ్ళను అందించారు. గ్రేటర్ వాసవి క్లబ్ గుంటూరు తరపున సుమారు 200 టోపీలు, కళ్ళజోళ్లను అందించిన సీహెచ్ శేఖర్, కొత్తూరు. అశోక్, కొత్తూరు హేమంత్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు), సింగయ్య (పశ్చిమ), ఎస్ఐలు రవీంద్రబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

టెన్త్ సోషల్ పరీక్ష వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: రంజాన్ పండగను పురస్కరించుకుని ఈనెల 31న ప్రభుత్వం సెలవు ప్రకటించిన దృష్ట్యా ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సోషల్ పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేసినట్లు గుంటూరు డీఈవో సీవీ రేణుక శుక్రవారం తెలిపారు.

ఈ-కేవైసీ పరేషాన్

- రేషన్ కార్డుదారులను కలవరపెడుతున్న ప్రక్రియ
- కుటుంబ సభ్యులందరూ వేలిముద్రలు వేయాలని ఆదేశాలు
- వేలిముద్రలు పడక, స్థానికంగా అందుబాటులో లేక తప్పని అవస్థలు
- తీవ్ర ఆందోళన చెందుతున్న కార్డుదారులు
- లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర అంటూ ఆవేదన



రేషన్ సరకుల పంపిణీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే (ఫైల్)

నరసరావుపేట టౌన్: కూటమి ప్రభుత్వం ఈ-కేవైసీ పేరుతో రేషన్ కార్డుల్లో కోత విధించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు తగ్గించేందుకు అనేక సర్వేలు నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు జారీ చేసిన సర్టిఫికెట్లను పునఃపరిశీలిస్తోంది. తాజాగా రేషన్‌కార్డులను తగ్గించేందుకు ఈ-కేవైసీతో ముడిపెట్టింది. పేదల గుర్తింపునకు కార్డులే ప్రామాణికం. వాటిని తొలగించేందుకు ఈ-కేవైసీ లింకు పెట్టడంతో లబ్ధిదారులపై పిడుగు పడినట్లైంది. త్వరగా ఈ పక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఎవరైనా ఈ-కేవైసీ చేయించుకోకుంటే వారికి ఇతర సంక్షేమ పథకాలు అందవన్న వార్తలు లబ్ధిదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కూటమి అధికారం చేపట్టాక ఎన్నికల హామీలు అమలు చేయకపోగా... ఉన్న పథకాలకు కత్తెర వేస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య **6,34,913**

రేషన్‌కార్డులలో సభ్యుల సంఖ్య **18,10,331**

ఈ-కేవైసీ పూర్తయిన వారు **16,04,511**

పెండింగ్‌లో ఉన్న సభ్యుల సంఖ్య **2,05,820**

రెవెన్యూ డివిజన్	కార్డులోని సభ్యుల సంఖ్య	ఈ-కేవైసీ పూర్తయిన వారు	ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు
నరసరావుపేట	7,34,735	6,52,409	82,326
సత్తెనపల్లి	5,04,336	4,48,225	56,111
గురజాల	5,71,260	5,03,877	67,383
మొత్తం	18,10,331	16,04,511	2,05,820

సంక్షేమ పథకాలు బంద్?

ఈ-కేవైసీ చేయించుకోకుంటే రేషన్ సరకులు పంపిణీ చేయరన్న చర్చ లబ్ధిదారుల్లో జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు పొందే ప్రతి ఒక్కరూ తమ వేలిముద్రను వేసి ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలి. ఇప్పటి వరకు ఈ విధానం లేదు. అయినా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సరకులు సజావుగా ఇంటి వద్దకు వచ్చేవి. కానీ కూటమి సర్కారు వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇక నుంచి అలా కుదరదని, ఈ-కేవైసీ ప్రతి ఒక్కరూ చేయించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. కార్డులతో అనుసంధానం కాని జాబితాను ఇప్పటికే రేషన్ డీలర్‌లకు అందజేశారు. ఈ మేరకు జిల్లాల్లో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్నారు. 5 నుంచి 60 ఏళ్లలోపు ఉన్నవారు రేషన్ షాపులు, సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది.

కార్డుల రద్దుకు ప్రణాళిక సిద్ధం

ఈ-కేవైసీ ముడిపెట్టి రేషన్ కార్డులను రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. సచివాలయాల సిబ్బంది తమ పరిధిలోని క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఈ-కేవైసీ కోసం వేలిముద్రలు సేకరిస్తున్నారు. రేషన్ కార్డులు ఎక్కడ ఉంటే అదే ప్రాంతానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. సుదూర ప్రాంతంలో ఉన్న వారు ఎలా రాగలరని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్డులకు భారీగా కోత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి కాని వారి వివరాలను సిద్ధం చేసి రేషన్‌కార్డులు రద్దు జాబితాలో చేర్చే అవకాశం ఉంది.

త్వరగా పూర్తి చేయాలి

ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇచ్చిన గడువులోపు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులు, వృద్ధుల వేలిముద్రలు పడకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికే 90 శాతం ఈ-కేవైసీ పూర్తి అయింది. త్వరలోనే పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని చేరుకుంటాం. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– నారదముని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రజకుడిపై టీడీపీ వర్గీయుల దాడి




చికిత్స పొందుతున్న శేషయ్యను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నేతలు

నరసరావుపేట: రొంపిచర్ల మండలం అన్నారం గ్రామంలో రజకుడైన కొండ్రముట్ల శేషయ్యపై దాడి చేసిన టీడీపీ వర్గీయులను వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. గాయపడిన రజకుడికి తగిన రక్షణ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టీడీపీ వర్గీయులు నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపును వెంటనే తొలగించాలని, ఆ బెల్టు షాపుకు మద్యం సరఫరా చేస్తున్న రొంపిచర్ల లైసెన్స్‌డ్ షాపు నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడిని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు, ప్రగతిశీల కార్మిక సంఘం (పీకేఎస్) నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శేషయ్య తన చిల్లర కొట్టు వద్ద ఉండగా జి.వీరాంజనేయులు, కె.వీరాంజనేయులు తమ 10 మంది అనుచరులతో వచ్చి నువ్విక్కడ షాపు నడపడానికి వీలులేదని, మాట వినకుంటే చంపేస్తామని బెదిరించారు. దుర్భాషలాడుతూ దాడి చేసి కర్రలతో తీవ్రంగా కొట్టారు. శేషయ్యను కుటుంబసభ్యులు నరసరావుపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని ఉంది. నరసరావుపేట రూరల్ పోలీసులు వచ్చి బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ రాసుకున్నారు. దాడి చేసిన టీడీపీ వర్గీయులు గ్రామంలో అనధికారికంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అట్టడుగు వర్గాల ప్రజలపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. బాధితుడిపైనే రొంపిచర్ల స్టేషన్‌లో కౌంటర్ కేసు నమోదు చేయించాలని చూస్తున్నారన్నారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఏడుకొండలు పాల్గొన్నారు.

కష్టాల్లో జీడిపప్పు వ్యాపారం

- దేవరపల్లి నుంచి తక్కువ ధరకే దిగుమతి
- వేటపాలెం జీడిపప్పుకు తగ్గిన డిమాండ్
- మూతబడుతున్న దుకాణాలు
- ఆందోళనలో వ్యాపారులు

వేటపాలెం: వేటపాలెంలో దొరికే జీడిపప్పుకు మంచి డిమాండ్. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పనులపై చీరాల వచ్చిన వారు ఇక్కడి జీడిపప్పు కొనుగోలుచేసి తీసుకుని వెళుతుంటారు. అంతేగాక రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కానీ ప్రస్తుతం వేటపాలెం జీడిపప్పు వ్యాపారం తీవ్ర పోటీని ఎదుర్కొంటుంది. దేవరపల్లి నుంచి వచ్చే జీడిపప్పు వేటపాలెం మార్కెట్‌ను ముంచెత్తుతుంది. దేవరపల్లి నుంచి తక్కువ ధరకు లభిస్తుండడంతో కొనుగోలుదారులతోపాటు వ్యాపారులు అటువైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వేటపాలెం నుంచి సరఫరా అయ్యే జీడిపప్పుకు డిమాండ్ తగ్గింది. ఇప్పటికే వేటపాలెంలో ఐదు జీడిపప్పు దుకాణాలు మూతపడ్డాయి. మరికొన్ని అదేబాటలో ఉన్నాయి.



వేటపాలెంలోని జీడి పప్పు ఫ్యాక్టరీ

ధరల్లో వ్యత్యాసం

వేటపాలెంలో జీడి పప్పు జంబో రకం గుళ్ల రూ.1100, అమెరికన్ గుళ్ల రూ.900, బద్ద రూ.900, ముక్క అరగుళ్ల రూ.780 ముక్క రూ.770 ధరలు ప్రస్తుతం ఉన్నాయి. దేవరపల్లిలో ప్రతి రకానికి ఇక్కడ ఉన్న ధరల్లో రూ.100 నుంచి రూ.200 వ్యత్యాసం ఉంటుందని వ్యాపారులు తెలిపారు.

ఆందోళనలో వేటపాలెం వ్యాపారులు

ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే కాలంలో వేటపాలెం ప్రాంతంతో జీడి పప్పు ఫ్యాక్టరీలు చాలావరకు మూత పడే అవకాశం ఉందని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

80 ఏళ్ల ప్రస్థానం

వేటపాలెంలో 80 ఏళ్లుగా జీడిపప్పు తయారవుతుంది. ఇక్కడ నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు, ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంటుంది. మొదట్లో నాలుగు ఫ్యాక్టరీలు ఉండేవి. ప్రస్తుతం 20 ఫ్యాక్టరీలు వరకు ఉన్నాయి. రాజమండ్రి, తుని, దేవరపల్లి ప్రాంతాల నుంచి జీడి గింజలు కొనుగోలు చేసి తీసుకు వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీల్లో జీడిపప్పుగా మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. వేటపాలెం ప్రాంతంలోని జీడి పప్పు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ రెండు వేల మంది ఉపాధి పొందుతున్నారు. జీడి పప్పు ఫ్యాక్టరీలు మూతపడే పరిస్థితి రావడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

దేవరపల్లిలో విస్తారంగా

దేవరపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జీడితోటలు విస్తారంగా ఉంటాయి. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో జీడి పప్పు ఫ్యాక్టరీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. సమీప ప్రాంతాల ప్రజలు తోటల నుంచి జీడి గింజలు సొంతంగా సేకరించుకొని తక్కువ ధరకు ఫ్యాక్టరీలకు అమ్ముతుంటారు. వాటిని కాల్చి ముడి జీడిపప్పుగా మార్చి విక్రయిస్తుంటారు. కిలో ముడి జీడిపప్పు దేవరపల్లి ప్రాంతంలో ప్రస్తుతం రూ.700లకు లభిస్తుంది. దీంతో చిన్నచిన్న వ్యాపారులు జీడిపప్పు వ్యాపారం చేయటం మొదలుపెట్టారు. ఎటువంటి పన్నులు లేకపోవడంతో వీరు విజయవాడ వంటి ముఖ్యమైన పట్టణాలకు చిన్నచిన్న గోతాల్లో కట్టి సరఫరా చేస్తుంటారు. తక్కువ ధరకే దేవరపల్లి జీడిపప్పు లభిస్తుండడంతో వ్యాపారులు అటువైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వేటపాలెం ప్రాంతంలో తయారవుతున్న జీడిపప్పుకు డిమాండ్ పడిపోయిందని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

కూలి ఖర్చులు తక్కువ

దేవరపల్లిలో కిలో పప్పు గింజల నుంచి వేరు చేసినందుకు కూలీలకు రూ.20 ఇస్తారు. అదే వేటపాలెంలో రూ.31 ఇస్తారు. కిలోకి రూ.11 వ్యత్యాసం ఉంది. దేవరపల్లిలో ఇతర ఖర్చులు కూడా తక్కువగా ఉండడంతోపాటు ఎలాంటి పన్నులు లేకపోవడంతో మార్కెట్‌లో తక్కువ ధరకే జీడిపప్పు లభ్యమవుతుంది.



ఆరబోసిన జీడి గింజలు

మట్టితో తమ్ముళ్ల సంపద సృష్టి..!

- అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న పచ్చ నేతలు
- దొండపాడు సమీపంలో రేయింబవళ్లు యథేచ్ఛగా తవ్వకాలు
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి జేబులు నింపుకొంటున్న ఖైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పిన మాటలు పచ్చనేతలు ఆచరణలో చూపుతున్నారు. ప్రకృతి వనరులను దోచుకుంటూ వారికి వారే సంపద సృష్టించుకుంటున్నారు. ఎక్కడ చూసినా అక్రమ మట్టి తవ్వకాలు, ఇసుక తరలింపుతో నిత్యం రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. దొండపాడులో ఏకంగా ఓ కొండపైనే కన్నేసి పిండి చేసేస్తున్నారు.



దొండపాడు సమీపంలో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన మట్టి క్వారీ

వినుకొండ: టీడీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం, బొల్లాపల్లి మండలం సరికొండపాలెం, పేరూరుపాడు చెరువుతోపాటు పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకొని పచ్చ నేతలు అక్రమంగా విక్రయించారు. తాజాగా దొండపాడు సమీపంలోని చెరువు కట్ట వద్ద ఉన్న కొండనే లక్ష్యంగా చేసుకుని తవ్వకాలు ప్రారంభించారు. రాత్రి, పగలు తేడా లేకుండా అధునాతన భారీ యంత్రాలతో తవ్వుతున్నారు.

వెంచర్లకు తరలింపు

దొండపాడు సమీపంలో అక్రమంగా తవ్విన మట్టిని లోడు రూ.9 వేల చొప్పున వినుకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. యథేచ్ఛగా ఈ తంతు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం వేసే రోడ్లకు ఇరువైపులా మార్జిన్‌లో కూడా ఇదే మట్టిని వాడుతుండటం గమనార్హం.

రహదారులు పాడవుతున్నా...

భారీ టిప్పర్లు రాత్రింబవళ్లు లోడుతో రోడ్లపై తిరుగుతుండడంతో అవి కూడా దెబ్బతింటున్నాయి. అడిగే నాథుడే లేకపోవడంతో దొండపాడు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో అప్పటికప్పుడు విచారణ చేపట్టిన అధికారులు నామమాత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోతున్నారు. ఫారెస్ట్, రెవెన్యూ భూములు కలిసి ఉండడంతో ఎవరికి వారు తమ పరిధి కాదంటున్నారు. జాయింట్ ఆపరేషన్ చేయడంలో అధికారులు తాత్సారం చేస్తుండటం అక్రమార్కులకు వరంగా మారింది. తక్కువ సమయంలో వేల ట్రక్కుల మట్టి కొల్లగొడుతూ కొండను పిండి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



వినుకొండలో రియల్ ఎస్టేట్ వెంచరుకు మట్టి తరలించిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం



అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. దొండపాడులో తవ్వకాల విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలన చేసి, తగిన చర్యలు చేపడతాం. సొంత భూముల్లో మట్టి తవ్వేందుకు కూడా రెవెన్యూ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– సురేష్ నాయక్, తహసీల్దార్, వినుకొండ

రేపు జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

అచ్చంపేట: పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 15, అండర్ 20 రెజ్లింగ్ పోటీలు ఈ నెల 30వ తేదీన స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అండర్ 15 పోటీలకు 2010–12, అండర్ 20 పోటీలకు 2005–08 సంవత్సరాల మధ్య పుట్టినవారై ఉండాలన్నారు. జనన ధ్రువీకరణపత్రం, ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఏప్రిల్ 4, 5వ తేదీలలో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 94419 36823 ఫోన్ నంబరుకు కాల్ చేయాలని సూచించారు.

పర్చూరులో విజిలెన్స్ అధికారుల దాడులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

పర్చూరు(చినగంజాం): పర్చూరులో విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో జిల్లా విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రవణ్‌కుమార్ ఆదేశాల మేరకు పర్చూరు వై జంక్షన్ వద్ద నిఘా పెట్టారు. కారంచేడు నుంచి చిలకలూరిపేట వైపు మినీ లారీ వెళుతుండగా ఆపి తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసేందుకు నరసరావుపేట తరలిస్తున్నట్లు చెప్పడంతో స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారనే సమాచారం తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. మినీ లారీతో సహా డ్రైవర్‌ని కూడా అదుపులోనికి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. దాడులలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం మినిలారీ

క్లుప్తంగా

హైరిస్క్ గర్భిణులకు సేవలు అందించండి

జేసీ సూరజ్ గనోరే సూచన



నరసరావుపేట: జిల్లాలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి అధిక సేవలను అందజేయటం ద్వారా మాతృమరణాలు అడ్డుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాలోని యడ్లపాడు, కొప్పనూరు, శిరిగిరిపాడు, ఆరేపల్లి ముప్పాళ్ల ప్రాథమిక వైద్యకేంద్ర పరిధిలో జరిగిన మాతృ మరణాలపై సమీక్షించారు. హైరిస్క్ గర్భిణులను అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వం వైద్యశాలలకు తరలించి తగిన చికిత్స అందజేయాలని ప్రభుత్వ వైద్యులకు సూచించారు. అవసరమైతే ఫోన్ ద్వారా గైనకాలజిస్టు సలహాలు తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శోభారాణి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామానికి చెందిన కోమటినేని శోభారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా శోభారాణి, శ్రీనివాసరావు దంపతులు శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. శోభారాణికి పలువురు అభినందనలు తెలిపారు.

డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నాతాని



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళగిరిలో ఈ నెల 27వ తేదీన నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కే-రిడ్జి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పంటలు ఎండిపోకుండా సాగునీరివ్వాలి

- రైతు, కౌలు రైతు సంఘాలు డిమాండ్
- ఎన్ఎస్‌పీ ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

నరసరావుపేట: పంటలు ఎండిపోకుండా సాగు నీరు అందించాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణం బీసీ కాలనీలోని ఎన్ఎస్‌పీ ఎస్ఈ కార్యాలయం వద్ద మిర్చి, వరి, మొక్కజొన్న రైతులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఈ పి.కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ... రైతు ప్రభుత్వమని చెప్పే పాలకులు రబీలో సాగు చేసిన పంటలు చేతికి అందాలంటే కచ్చితంగా ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సిందే అన్నారు. పెట్టుబడి సాయం విషయంలో రైతులను మోసగించిన ప్రభుత్వం సాగు నీరు విషయంలోనూ మోసానికి పాల్పడుతోందని తెలిపారు. ప్రస్తుతం డెడ్ స్టోరేజీ కంటే అదనంగా నీటి లభ్యత ఉందన్నారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ.. మండలాలవారీగా పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో గుర్తించి తగిన నీరు ఇవ్వాలన్నారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, వివిధ సంఘాల నాయకులు జి.పిచ్చారావు, ఆవుల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, ఈవూరి అప్పిరెడ్డి, క్రోసూరు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నరసరావుపేట మండలాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

- అర్జీదారుల సమస్యల గురించి ఆరా
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్

నాదెండ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం ఇర్లపాడు, అప్పాపురం గ్రామాల్లో పర్యటించారు. అప్పాపురం గ్రామానికి చెందిన పఠాన్ మస్తాన్‌వలి ఖాన్ తమ గ్రామానికి సచివాలయం కావాలంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఇర్లపాడు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాలకు కలిపి ఇర్లపాడులో సచివాలయం ఉందని, రోజూ ఇర్లపాడు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఇర్లపాడు గ్రామానికి చెందిన రంగనాథుల సుబ్బాయమ్మ తనకున్న పొలం విస్తీర్ణం రీసర్వేలో తగ్గిందని, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ శుక్రవారం స్థానికంగా పర్యటించారు. అర్జీదారులను నేరుగా కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇర్లపాడు గ్రామంలో మిర్చి రైతుల కష్టాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా తమకు లభించటం లేదని రైతులు వాపోయారు. ఖర్చులు పెరిగాయని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపారాణి, మండల సర్వేయర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి మధు, వీఆర్వో నాగేంద్రబాబు, గ్రామ సర్వేయర్ వసంతరావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు, నివాసాలు పరిశీలన

బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న అధికారులు



దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

దాచేపల్లి: మండలంలోని పెదగార్లపాడు, తక్కెళ్లపాడు, తంగెడ గ్రామాల్లో అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే దుమ్ము, ధూళి వలన పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయని ఆరోపణలున్నాయి. భారీ బ్లాస్టింగుల ధాటికి ఇళ్లు కూడా దెబ్బతినటంతో బాధితులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఫ్యాక్టరీల నిర్మాణం కోసం పొలాలు ఇచ్చిన రైతుల కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని బాధితులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకునేందుకు అధికారుల కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ నేతృత్వంలోని ఈ కమిటీ మూడు గ్రామాల్లో పర్యటించింది. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంది. దెబ్బతిన్న పంటలను, నివాసాలను పరిశీలించింది. బాధితుల నుంచి వివరాలు సేకరించింది. జరిగిన నష్టం గురించి కమిటీ ముందు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగాల కల్పనతోపాటు నష్ట పరిహారం చెల్లించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఫ్యాక్టరీల ఆధీనంలో దేవదాయ, ప్రభుత్వ భూములు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో సంబంధిత రికార్డులను కూడా బృందం సభ్యులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక అందజేస్తామని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. తహసీల్దార్ కేవీ కుటుంబరావు, మైనింగ్, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, అటవీ శాఖ, దేవదాయ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలుడి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ముప్పాళ్ళ: బాలుడి హత్య కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు ముప్పాళ్ళ ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2021లో ముప్పాళ్ళకు చెందిన పఠాన్ మహమ్మద్ అఫ్రిది (16)ని చంపుతానని షేక్ పెద్దబాజీ బెదిరించాడు. తన తమ్ముడు కుమారుడిని చెడగొడుతున్నాడని అతడు భావించడమే దీనికి కారణం. ఈ క్రమంలో అఫ్రిది రోడ్డుపై వెళుతుండగా పెద్దబాజీ కత్తితో దాడి చేసి చంపేశాడు. అప్పటి ఎస్సై ఎం.పట్టాభిరామయ్య కేసు నమోదు చేశారు. అప్పటి సత్తెనపల్లి రూరల్ సీఐ బి.నరసింహారావు చార్జిషీట్ వేయగా, గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో విచారణ ప్రారంభమైంది. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రస్తుత సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచనల మేరకు ప్రస్తుత ఎస్సై వి.సోమేశ్వరరావు, సెషన్స్ కోర్టు కానిస్టేబుల్ షేక్ సైదాలు సంబంధిత సాక్షులను కోర్టులో ప్రవేశపెడుతూ కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. విచారణ అనంతరం గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి... నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఫిర్యాది అయిన అఫ్రిది తల్లి పఠాన్ సైదాబీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదనలు వినిపించారు.

జాతీయ జట్టుకు శిక్షణ పూర్తి

జె.పంగులూరు: ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో 57వ జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల పోటీలు జరగనుంది. ఈ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు 10 రోజుల నుంచి స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, పంగులూరు గ్రామస్తుల సహకారంతో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

వివాహిత హత్య కేసులో ఇద్దరు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

వినుకొండ: విలాసాలకు అలవాటుపడటంతో దొంగతనాలు చేయడం.. ఇందులో భాగంగా ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకోవడం.. ఎవరైనా ఎదురు తిరిగితే హత్య చేయడం.. ఇదీ ఆ ఇద్దరి నైజం. వివాహిత హత్యకేసులో నిందితులైన వారిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వినుకొండ పట్టణంలో సంచలనంగా మారిన కొప్పరపు సావిత్రి హత్య కేసును పోలీసులు ఛేదించారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ శోభన్ బాబు, సిబ్బంది కలిసి ఆ నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఈ నెల 17వ తేదీన పట్టణంలోని కొత్తపేట ప్రధాన వీధిలో కొప్పరపు సావిత్రి హత్యకు గురైందన్నారు. వినుకొండ రూరల్ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన కట్టెంపూడి సాంబయ్య, ఆవుల మంగమ్మ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు, అదే క్రమంలో మధ్యాహ్న సమయంలో సావిత్రిని హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సాంబయ్య ఆటో నడుపుతుంటాడని, మంగమ్మ ఇళ్లల్లో పనులు చేస్తుందని తెలిపారు. వీరికి వివాహేతర సంబంధం ఉందని చెప్పారు.

గొంతుకు చీర బిగించి హత్య

ఇంట్లో ఒంటరిగా ఉన్న సావిత్రి వద్దకు ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇద్దరు వెళ్లి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సావిత్రి చేతులను సాంబయ్య పట్టుకోగా, మంగమ్మ చీరను సావిత్రి మెడకు బిగించడంతో ఊపిరి ఆడక మృతి చెందిందని తెలిపారు. అనంతరం సావిత్రి మెడలోని బంగారపు గొలుసు, రెండు ఉంగరాలను దుండగులు కాజేశారని పేర్కొన్నారు. బంగారు ఉంగరం, రూ.1.30 లక్షల నగదును నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ శోభన్‌బాబు, ఎస్ఐలు షామీర్‌బాషా, సత్యనారాయణ, కె.స్వర్ణలత, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా రామిరెడ్డి



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పల్నాడు జిల్లా చైర్మన్‌గా ఎల్.వి.రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన గతంలో ఎస్టీయూ మండల అధ్యక్షునిగా, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్థిక కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. గురువారం రాత్రి నిర్వహించిన ఫ్యాప్టో కార్యవర్గ సమావేశంలో చైర్మన్‌గా ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడులో 10 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఏకోపాధ్యాయునిగా వెళ్లి తనదైన కృషితో వారి సంఖ్యను 786 మంది వరకు పెంచారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద ప్రాథమిక పాఠశాలగా కేంద్ర మానవ వనరుల శాఖ మన్ననలు పొందారు. రాష్ట్రంలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన తొలి పాఠశాల కూడా ఇదే కావటం విశేషం. ఈ పాఠశాలను ప్రాథమికోన్నత, ఉన్నత బడిగా తీర్చిదిద్ది ఉపాధ్యాయ లోకానికి ఆదర్శంగా నిలిచారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, గౌరవాధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఆర్థిక కార్యదర్శి ఎ.ఏమండీ తదితరులు ఆయన్ను అభినందించారు.

వీఆర్‌ఏలు ఐకమత్యంగా పోరాడాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమరావతి: విజయవాడలో ఏప్రిల్ 5వ తేదీన జరగబోయే గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. ఐకమత్యంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల సంఘ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జందగీ సాహెబ్ మాట్లాడుతూ... సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. జీతాల పెంపు, పదోన్నతులు లేవని వాపోయారు. తెలంగాణలో వీఆర్‌ఏలకు పే స్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందని గుర్తుచేశారు. ఏపీలో మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా కనికరించడం లేదన్నారు. దొడ్డిదారిన నైట్ వాచ్‌మన్ డ్యూటీలు బలవంతంగా చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి సూరిబాబు, గ్రామ రెవెన్యూ సహాయకులు గణేశ్, కరీముల్లా, కోటేశ్వరరావు, సువార్త, ఖాదర్ బీ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు అవగాహన

నరసరావుపేట: జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చట్టంలోని నియమనిబంధనలు తప్పకుండా పాటించాలని గురజాల ఏపీపీ నాగమణి సూచించారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి అధ్యక్షతన ప్రసూతి వైద్య నిపుణులకు లింగ నిర్ధారణ చట్టం – 1994 నిర్వహణ, ఆడపిల్లల ప్రాముఖ్యత, భ్రూణ హత్యలు నివారణ, మెడికో లీగల్ కేర్ గురించి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. గురజాల ఏపీపీ నాగమణి పాల్గొని మెడికో లీగల్ కేర్ విక్టిమ్స్ ఆఫ్ సెక్సువల్ హింసపై అవగాహన కలిగించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, నీలకంఠేశ్వరరావు, డిప్యూటీ డెమో ఎస్‌కే సాంబశివరావు, డిస్ట్రిక్ట్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. డాక్టర్ ఏఎన్ పరిమళ జగన్, డాక్టర్ భద్రకాంత్ శర్మల ఆధ్వర్యంలో సభ్యులు ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)లో భాగంగా వైద్యశాలలో సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ నాణ్యమైన సేవలపై దృష్టి పెట్టాలన్నారు. శనివారం కూడా పరిశీలించనున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెలుగొండ రెడ్డి, డాక్టర్ ఆదిత్య, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నసీర్ అహ్మద్‌కు కళారత్న పురస్కారం



పిడుగురాళ్ల: ప్రముఖ చరిత్ర కారుడు, రచయిత, పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సయ్యద్ నసీర్ అహ్మద్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా కళారత్న పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి మల్లికార్జునరావు నుంచి వర్తమానం అందుకున్నట్లు సయ్యద్ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. నసీర్ అహ్మద్ తెలుగులో 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించారు. ఈ గ్రంథాలు ఆంగ్లం, ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతీ భాషల్లో వెలువడ్డాయి. సమర యోధుల పాత్రలను తెలియపరుస్తూ ప్రచారం చేస్తున్నారు. తన కుటుంబం, మిత్రుల సహకారంతో ప్రచురించిన గ్రంథాలను పలువురికి కానుకగా అందిస్తున్నారు. నసీర్ అహ్మద్ కృషికి గుర్తింపుగా ప్రభుత్వం ఆయనకు ఉగాది పర్వదినం సందర్భంగా పురస్కారాన్ని ప్రకటించింది. రూ. 50 వేల నగదు, జ్ఞాపికను ఈ నెల 30వ తేదీన ఉగాది పురస్కార ప్రదానోత్సవంలో ఆయన అందుకోనున్నారు.

‘అచ్చుల’కు ప్రతిభా అవార్డు



రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన కవి, రచయిత అచ్చుల వెంకట సుబ్బారావుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ -టీచర్స్ ఆర్గనైజేషన్ ఈ అవార్డు ప్రకటించింది. దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా, సాహిత్య రంగంలో కవి, రచయితగా సేవలందించారు. వచ్చే నెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

దుస్తుల్లో నగలు దాచి మర్చిపోయిన వృద్ధురాలు

- విక్రయించాక లబోదిబో
- రికవరీ చేసిన పోలీసులు

కొల్లిపర: పాత చీరల్లో ఆభరణాలను పెట్టిన సంగతి మర్చిపోయి వాటిని అమ్మేసిన వృద్ధురాలు ఆ తర్వాత విషయం గుర్తుకు వచ్చి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు పాత చీరలు కొన్న వ్యక్తిని గుర్తించి ఆభరణాలను వృద్ధురాలికి తిరిగి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. మున్నంగికి చెందిన 74 ఏళ్ల కుర్రే వెంకటసుబ్బమ్మ తన ఇంట్లోని నాలుగు పాత చీరలను గురువారం అమ్మేసింది. వాటిలో రెండు బంగారు గాజులు, ఒక గొలుసు (మొత్తం 56 గ్రాములు) ఉన్న సంగతి మర్చిపోయింది. ఆ తర్వాత ఆభరణాల విషయం గుర్తుకు రావడంతో శుక్రవారం కొల్లిపర పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ పి.కోటేశ్వరరావు నేతృత్వంలో సిబ్బంది బృందంగా ఏర్పడి కెమెరాల పుటేజీలను పరిశీలించి, చీరలను కొనుగోలు చేసింది తెనాలి నందులపేటకు చెందిన పాత చీరల వ్యాపారం చేసే తాడిశెట్టి సాంబశివరావుగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా అప్పటికే అతను ఆభరణాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చేందుకు బయలుదేరాడు. ఆయన్ను కొల్లిపర తీసుకువెళ్లి ఆభరణాలను అతనిచేతుల మీదుగానే వెంకటసుబ్బమ్మకు అందజేశారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మంగళగిరి: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తున్న విద్యార్థిని అటుగా వెళ్తున్న పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం అర్ధరాతి జరిగింది. రూరల్ సీఐ వై. శ్రీనివాసరావు కథనం మేరకు శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు శేఖర్‌బాబు, సాగర్ బాబు విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఆగవర్తపాడు, గడ్డిపాడు రైల్వే గేటు వద్ద కొంత దూరంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి సిద్ధపడడం గమనించారు. వెంటనే అప్రమత్తమైన కానిస్టేబుళ్లు యువకుడు వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. తాను ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నానని, తోటి విద్యార్థులు అవమానించేలా మాట్లాడడంతో ఆత్మహత్య చేసుకుందామని వచ్చానని వివరించాడు. తనది చీరాలని, పేరు ఫణిదపు వెంకట రుషి అని చెప్పాడు. విద్యార్థికి తెలిసిన మరో యువకుడికి సమాచారం ఇచ్చి ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థిని తీసుకెళ్లారు.

1,32,926 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,14,566 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,32,926 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,300 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. ఇంకా 48,513 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.